వధూవరులకు ఆశీర్వాదం

సిద్దిపేటలో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే హరీశ్ రావు

సిద్దిపేట, నవంబర్ 17 : సిద్దిపేట పట్టణంలో జరిగిన పలు వివాహాలకు ఆదివారం మాజీ మంత్రి హరీశ్ రావు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, కొండం సంపత్ రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, దరిపల్లి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

వివాహ వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే పల్లా

చేర్యాల, నవంబర్ 17 : చేర్యాల, ధూళిమిట్ట, కొమురవెల్లి మండలాల్లో జరిగిన వివాహ వేడుకలకు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. పట్టణంలోని రేణుకా గార్డెన్స్‌లో జరిగిన యువజన నాయకుడు గందె వేణు సోదరుడు అరవింద్, సంధ్యకుమారిలతో పాటు భద్రకాళి గార్డెన్స్, ధూళిమిట్ట మండలంలోని బెక్కలలో జరిగిన వివాహ వేడుకలకు హాజరై వధూవరులను ఎమ్మెల్యే ఆశీర్వదించారు. బీఆర్ఎస్ నాయకులు అం కుగారి శ్రీధర్‌రెడ్డి, ముస్త్యాల బాల్‌నర్సయ్య, శివగారి అంజయ్య, మంచాల కొండయ్య, ఉట్కూరి అమర్‌గౌడ్, పచ్చిమడ్ల మానస, గదరాజు చందు, అనంతుల మల్లేశం, ముస్త్యాల నాగేశ్వర్‌రావు, జింకల పర్వతాలు, అవుశర్ల వెంకటేశ్, తాండ్ర సాగర్ తదితరులు ఉన్నారు.

చేర్యాలలో వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

'కెప్టెన్'కు శుభాకాంక్షల వెల్లువ

హుస్నాబాద్ : కేక్ కట్ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత తదితరులు

హుస్నాబాద్, నవంబర్ 17 : రాజ్యసభ మాజీ సభ్యుడు, మాజీ మంత్రి, బీఆర్ఎస్ పొలిట్‌బ్యూరో సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతరావు పుట్టిన రోజు వేడుకలు హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. కెప్టెన్ సాబ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు ఎండీ అన్వర్, మండలాధ్యక్షుడు గంగం మధుసూదన్‌రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, కౌన్సిలర్లు వాల సుప్రజ, గూల్ల రాజు, పెరుక భాగ్యరెడ్డి, గోవిందు రవి, నాయకులు లక్ష్మణ్‌నాయక్, ఎండీ అయూబ్, గోనెల మధుకర్, అనుమండ్ల ప్రభాకర్‌రెడ్డి, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేటలలో..

అక్కన్నపేట, నవంబర్ 17: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు ఆధ్వర్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు కెప్టెన్ లక్ష్మీకాంతారావు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. బీఆర్ఎస్వీ మండల అధ్యక్షుడు పుల్లూరి శ్యామ్, సోషల్ మీడియా కన్వీనర్ మిట్టపల్లి రాజు పాల్గొన్నారు.

అక్కన్నపేట : అంబేద్కర్ చౌరస్తా వద్ద కేక్ కట్ చేస్తున్న సాంబరాజు

కోహెడలో..

కోహెడ, నవంబర్ 17 : కోహెడ మండల కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్ ఇంట్లో మండల బీఆర్ఎస్ కార్యకర్తలు ఆదివారం కెప్టెన్ లక్ష్మీకాంతారావు జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఆయన తెలంగాణ కోసం చేసిన పోరాటాన్ని గుర్తు చేసుకున్నారు. నాయకులు పొన్నాల లక్ష్మణ్ తిప్పారపు శ్రీకాంత్, మంద రాజయ్య, పేర్యాల రాజేశ్వర్‌రావు, ఆవుల మహేందర్, అబ్దుల్ రహీం, కేతిరెడ్డి బాల్‌రెడ్డి, పెరుగు నరేందర్‌రెడ్డి , వట్టిపెల్లి రాజిరెడ్డి, భీంరెడ్డి రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కోహెడ : కేక్ కట్ చేస్తున్న నాయకులు

గుంతలమయంగా రహదారులు

తున్కిమక్తాల సమీపంలో రోడ్డు మధ్యలో ఏర్పడ్డ పెద్ద గుంత

వర్గల్, నవంబర్ 17 : మండలంలోని ఆయా గ్రామీణ రహదారులు గుంతలమయంగా మారాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంతో పాటు తున్కిఖల్సా మీదుగా తున్కిమక్తాల గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. మహిళలు, రైతుకూలీలు, స్కూల్ విద్యార్థులు రోజూ ఈ మార్గం ద్వారానే ఆయా ప్రాంతాలకు వెళ్తున్నారు. రోడ్డుకు ఇరువైపులా పెరిగిన ముళ్లపొదలు కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఎల్లారెడ్డిపేటలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

తొగుట, నవంబర్ 17 : మండల పరిధిలో 2008-2009 బ్యాచ్ చెందిన ఎల్లారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గురువులను సన్మానించారు. కార్యక్రమంలో తీగల సత్యనారాయణగౌడ్, సోమగారి నాగిరెడ్డి, అంజిరెడ్డి, తాతిరెడ్డి, హనుమారెడ్డి పాల్గొన్నారు.

సిద్దిపేటలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గ్రూప్-3 అభ్యర్థుల క్యూ లైన్

సజావుగా గ్రూప్-3

పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కలెక్టరేట్/సిద్దిపేట, నవంబర్ 17: టీజీపీఎస్సీ గ్రూప్-3 పేపర్ 1,2 పరీక్షలు సజావుగా ముగిశాయని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. ఆదివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలో జరిగిన టీజీపీఎస్సీ గ్రూప్-3 పరీక్ష కేంద్రాలను కలెక్టర్ మనుచౌదరి,అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ వేర్వేరుగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరీక్ష కేంద్రాల్లో ఏమైనా సమస్యలు తలెత్తాయా, ఎన్ని గంటలకు పరీక్ష పేపర్లు పరీక్ష కేంద్రానికి వచ్చాయి, ఎంత మంది అభ్యర్థులు హాజరయ్యారని అడిగి తెలుసుకున్నారు. బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. 37 పరీక్ష కేంద్రాల్లో మొత్తం 13401 మంది అభ్యర్థులకు మొదటి పేపర్‌కు 55.35 శాతంతో 7420 మంది, రెండో పేపర్‌కు 55.27 శాతంతతో 7412 మంది హాజరైనట్లు తెలిపారు. నేడు జరిగే పరీక్షకు అభ్యర్థులు నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు.

పరీక్షా కేంద్రం వద్ద పోలీసు అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ అనురాధ

పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

పోలీసు కమిషనర్ అనురాధ

గ్రూప్ త్రీ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతో పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసు కమిషనర్ అనురాధ అన్నారు. సిద్దిపేట పట్టణంలోని ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాల, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ కాలేజీ ఎన్సాన్ పల్లి తదితర పరీక్ష కేంద్రాలను పోలీసు కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. ఎలాం టి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాట్లపై, పరీక్ష అనంతరం ఎగ్జామ్స్ షీట్స్ స్ట్రాంగ్ రూమ్‌కు తరలింపు పట్ల అధికారులకు, సిబ్బందికి తగు సూచనలు, సలహాలు చేశారు. అడిషనల్ గ్రూప్ త్రీ ఎగ్జామ్ పోలీ స్ నోడల్ అధికారి ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, సిద్దిపేట ఏసీపీ మధు, త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ విద్యాసాగర్, ఎస్సీ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

అభ్యర్థులను చెక్ చేసి లోపటికి పంపిస్తున్న పోలీసులు

సిద్దిపేటలో తల్లి ఎగ్జామ్స్ రాయడానికి వెళ్లగా చంటి పిల్లల్ని లాలిస్తున్న బంధువులు

ఎగ్జామ్‌కి వెళ్తున్న తల్లికి ఆల్ ది బెస్ట్ చెబుతున్న చిన్నారులు

నిమిషం నిబంధనతో 36 మంది పరీక్షకు దూరం

ఒక్క నిమిషం నిబంధన వల్ల 36 మంది అభ్యర్థులు తొలిరోజు జరిగిన పరీక్షకు దూరమయ్యారు. సిద్దిపేట పట్టణంలోని ఇందిరానగర్‌నగర్ హైస్కూల్ సెంటర్‌కు నిమిషం లేటుగా వచ్చిన అశోక్ అనే అభ్యర్థి పోలీసులను బ్రతిమిలాడడమే కాకుండా అక్కడ డ్యూటీలో ఉన్న పోలీసు ఇన్‌స్పెక్టర్ కాళ్లు మొక్కిన కనికరించలేదు. దీంతో పరీక్ష రాయకుండానే నిరాశగా వెనుదిరిగారు.

లేటుగా రావడంతో పోలీసుల కాళ్లు పట్టుకొని వేడుకుంటున్న ఓ అభ్యర్థి

పరీక్షకు అనుమతించాలని అభ్యర్థుల నిరసన

సిద్దిపేట శివారులోని ఇందూర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిమిషం ఆలస్యం వల్ల పరీక్షకు వచ్చిన అభ్యర్థులు తమను అనుమతించాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. నిబంధనలు అందరికీ వర్తిస్తాయని ఎవరినీ అనుమతించడం లేదని పోలీసులు సర్ది చెప్పడంతో అభ్యర్థులు పరీక్షా కేంద్రం నుంచి వెను తిరిగి వెళ్లిపోయారు.

చేర్యాలలో బోనాల సందడి

అమ్మవారిని దర్శించుకున్న నేతలు

దుర్గమాత ఆలయం వద్ద భక్తులు సమర్పించుకున్న బోనాలు

చేర్యాల, నవంబర్ 17 : దుర్గామాత ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా ఆదివారం చేర్యాల పట్టణ ప్రజలు అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం రాత్రి నుంచి మొదలైన బోనాల సందడి ఆదివారం ఉదయం వరకు కొనసాగింది. దర్గామాత కల్యాణోత్సవం అత్యంత వైభవం గా సాగింది. చేర్యాలలో అమ్మవారి ఉత్సవాల సందర్భంగా పట్టణ ప్రజలతో పాటు బంధువులు, స్నేహితులు తరలిరావడంతో సందడి నెలకొన్నది. మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి, మాజీ జడ్పీటీసీ కొమ్ము నర్సింగరావు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

ఆలయాల్లో కార్తిక పూజలు

నాచగిరిలో సత్యనారాయణ వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

వర్గల్, నవంబర్ 17 : వర్గల్ మండలంలోని ప్రధాన దేవాలయాలైన నాచగిరి లక్ష్మీ నృసింహస్వామి, వర్గల్ విద్యాధరి సరస్వతీ ఆలయం, శ్రీవేణుగోపాలస్వామి దేవాలయాల్లో ఆదివారం కార్తిక పూజలు నిర్వహించారు. ఉపవాస దీక్షలు,కార్తీక దీపారాధనలు చేశారు. సత్యనారాయణ వ్రతాలు పెద్ద ఎత్తున జరిగాయి.

ఉపాధ్యాయుడి కుటుంబానికి చెక్కు అందజేత



మృతుడి కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి

చేర్యాల, నవంబర్ 17 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మండలంలోని వేచరేణికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పర్వాటక ధర్మారెడ్డి కుటుంబ సభ్యులకు పీఆర్టీయూ సంక్షేమ నిధి నుంచి రూ. లక్ష చెక్కు మంజూరైంది. పీఆర్టీయూ టీఎస్ బలపరిచిన కరీంనగర్, నిజామాబాద్, అధిలాబాద్, మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అధికారిక అభ్యర్థి వంగ మహేందర్‌రెడ్డి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షు డు మల్లూగారి ఇంద్రసేనారెడ్డి, మండల అధ్యక్షులు కేవీఎన్‌రెడ్డి, కామిడి శ్రీనివాస్‌రెడ్డి, వంగ శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు కామిడి ప్రభాకర్‌రెడ్డి, నాయకుడు సతీష్ పాల్గొన్నారు.

పొలంలో వరికొయ్యలు కాల్చొద్దు

కొమురవెల్లి : ఐనాపూర్‌లో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

సిద్దిపేట కమాన్, నవంబర్ 17 : రైతులు యాసంగి పంట సాగుకు సిద్ధమవుతున్న తరుణంలో కోసిన వరి కొయ్యలను పొలంలోనే కాల్చవద్దని జిల్లా వ్యవసాయాధికారి రాధిక సూచించారు. ఆదివారం సిద్దిపేటలో ఆమె మాట్లాడారు. పొలంలోనే వరికొయ్యలు కాల్చడం వల్ల నేల సారం కోల్పోతుందని ఇది గమనించాలని రైతులకు సూ చించారు. మెళకువలు పాటించి అధిక దిగుబడుల సాధనకు కృషి చేయాలన్నారు. సాగులో జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు.

కొమురవెల్లిలో..

కొమురవెల్లి, నవంబర్ 17 : వరి పంట కోసిన తర్వాత చాలా మంది రైతులు వరి మొదళ్లు (కొయ్యలు) కాలబెడుతున్నారని, కాల్చొవద్దని జిల్లా వ్యవసాయాధికారిని రాధిక అన్నారు. మండలంలోని ఐనాపూర్‌లో కోసేందుకు సిద్ధంగా ఉన్న వరి పంటను కొమురవెల్లి మండల వ్యవసాయాధికారి వెంకట్రామమ్మతో కలిసి పరిశీలించారు. ఇది సేంద్రియ ఎరువులా ఉపయోగపడుతుందని తెలిపారు.

హుస్నాబాద్‌లో..

హుస్నాబాద్, నవంబర్ 17 : వరిపంట కోసిన అనంతరం మిగిలి ఉన్న వరికొయ్యలను కాల్చొదని సూచించారు. భూమిలోని భూసారం పూర్తిగా తగ్గిపోయే ప్రమాదం ఉన్నదని, వరి కొయ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ తగలబెట్టకూడదని మండల వ్యవసాయ అధికారి నాగరాజురెడ్డి తెలిపారు. వరి కొయ్యలను నీళ్లుపెట్టి దున్నడం ద్వారా కొన్ని రోజులకే అవి మురిగిపోయి తర్వాత వేసే పంటకు మరింత బలాన్ని ఇస్తాయన్నారు. పర్యావరణానికి ప్రమాదకరంగా మారుతున్నందున రైతులు వరికొయ్యలను కాల్చొద్దని అధికారులు సూచించారు.

గజ్వేల్‌లో..

గజ్వేల్, నవంబర్ 17: రైతులు వరి కొసిన తర్వాత వరి మొదళ్లను కాలబెట్టొద్దని ఏడీఏ బాబునాయక్ తెలిపారు. మొదళ్లను కాలబెట్టడంతో భూమిలోని వివిధ రకాల సూక్ష్మజీవులు కాలిపోయి నశిస్తాయన్నారు. ఒకసారి పొలాన్ని కాలబెడితే వ్యవసాయం పాతికేండ్లు వెనుకకు పోతుందన్నారు.

వివాహిత ఆత్మహత్య

మర్కూక్,నవంబర్17 : కడుపు నొప్పి భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని యూసూఫ్‌ఖాన్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై దామోదర్ తెలిపిరన వివరాల ప్రకారం.. యూసుఫ్‌ఖాన్‌పల్లి గ్రామానికి చెందిన నోన్వార్ సోనుభాయ్ (20)ను అదే గ్రామానికి చెందిన అమర్‌సింగ్‌కు 7నెలల క్రితం ఇచ్చి వివాహం జరిపించారు. వివా హం కాక ముందు నుంచే కడుపు నొప్పితో బాధపడుతుండేది. శనివారం కడుపు నొ ప్పి వస్తుందని తండ్రికి చెప్పింది. తండ్రి దవాఖానకు తీసుకెళ్తా అనగా వద్దు.. నువ్వు పనికి వెళ్లు అని చెప్పింది. సాయంత్రం వచ్చేసరికి ఇంట్లో ఉరివేసుకొని కనిపించిందని, వెంటనే గజ్వేల్ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తల్లి పిర్యాదు మేరకు ఎస్సై దామోదర్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

మిరుదొడ్డి, నవంబర్ 17 : అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఆదివారం చోటు చేసుకుంది. మిరుదొడ్డి ఎస్సై పరశురాములు తెలిపిన వివరాల ప్రకారం.. మిరుదొడ్డికి చెందిన గుడ్డొల్ల బాల్‌రాజు (32) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబ సభ్యులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. బాల్‌రాజు, చెల్లెలు, తమ్ముడి పెండ్లిలు చేయడానికి అప్పులు చేశాడు. తెచ్చిన రూ.5 లక్షల అప్పులను ఎలా తీర్చాలని మనస్తాపానికి గురై ఆదివారం వ్యవసాయ బావి వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, నాలుగేండ్ల కూతురు ఉంది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థికసాయం

మర్కూక్, నవంబర్ 17: మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన మునిగడప యాదయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం బాధిత కుటుంబాన్ని మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ నాయకుడు తాండ పాండుగౌడ్ పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు కొండ నొళ్ల నర్సయ్య, గిద్దల భిక్షపతి, సర్ధా ని స్వామి, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

సీపీఎం చేర్యాల మండల కార్యదర్శిగా అరుణ్ కుమార్

చేర్యాల, నవంబర్ 17 : సీపీఎం మండల కార్యదర్శిగా బండకింది అరుణ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన 8వ సీపీఎం మండల మహాసభలో అరుణ్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కమిటీ సభ్యుడిగా కొంగరి వెంకట్‌మావో, గొర్రె శ్రీనివాస్, నాగపురి కనకయ్య, రేపాక కుమార్, స్వర్గం శ్రీకాంత్, దర్శనం రమేశ్, ఎండీ కరీం, దొండకాయల సంపత్, మోకు ఇంద్రం, సూర్ణ సంపత్‌లతో మండల కమిటీ ఎన్నికయ్యింది. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. రెవెన్యూ డివిజన్ సాధనతో నియోజకవర్గ ఏర్పాటు ధ్యేయంగా మండల కమిటీ పని చేస్తుందని తెలిపారు.

మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య

చిన్నకోడూరు, నవంబర్ 17 : మనస్తాపంతో వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన చిన్నకోడూరులో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కర్నె రాంరెడ్డి (70) తమ్ముడు యాదగిరి కుటుంబ సభ్యులకు కొంతకాలంగా భూమి పంపకాలపై వివాదాలు కొనసాగుతున్నాయి. తల్లి పోషణపై ఇరువురు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయంపై గ్రామంలో పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు నిర్వహించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. గత వారం నుంచి రాంరెడ్డి సమస్యతో పాటు తల్లి పోషణ గురించి దిగులు చెందుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాంరెడ్డి కుమారుడు సుధాకర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట టౌన్, నవంబర్ 17 : ప్రజలకు న్యాయపరమైన సలహాలతో పాటు తగు న్యాయం చేయాలి.. అనే ఆలోచన కలిగి ఉన్న ఔత్సాహికులు,ఉపాధ్యాయులు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు, వైద్యులు డాక్రా మహిళలు, పారాలీగల్ వలంటీర్లుగా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్న వారు ఈ నెల 30 లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయిరమాదేవి కోరారు. ఆసక్తి గల వారు బయోడేటా, గుర్తింపు కార్డు, రెండు పాస్ ఫోర్టు సైజ్ ఫొటోలతో సిద్దిపేట జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న న్యాయసేవాధికార సంస్థకు అందజేయాలన్నారు. పారాలీగల్ వలంటీర్ల కనీస విద్యార్హత పదో తరగతిగా పేర్కొన్నారు. లీగల్ సర్వీసెస్ అథారిటీ యాక్ట్ ప్రకారం గౌరవ వేతనం లభిస్తుందన్నారు.

నేడు పలు వార్డుల్లో అభివృద్ధి పనుల ప్రారంభం

హుస్నాబాద్‌టౌన్, నవంబర్ 17 : పట్టణంలోని పలువార్డుల్లో అభివృద్ధి పనులకు సోమవారం శంకుస్థాపనలు జరుగుతాయని మున్సిపల్ కమిషనర్ టి. మల్లికార్జున్ గౌడ్ తెలిపారు. పట్టణంలోని 7,11,13, 17,20వ వార్డుల్లో కమ్యూనిటీహాల్స్, సీసీ రోడ్లు, మురుగుకాల్వల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేయనున్నట్లు వెల్లడించారు.

రేపు ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా సమావేశం

గజ్వేల్, నవంబర్ 17: ఈ నెల 19న ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మార్పీఎస్ సమావేశాన్ని గజ్వేల్‌లో నిర్వహిస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కృష్ణమాదిగ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ తర్వాతనే ఉద్యోగాల భర్తీ చేయాలని, వర్గీకరణ చేయకుండా ఉద్యోగాలు భర్తీ చేయడంతో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. గజ్వేల్‌లోని కోలా అభిరాం గార్డెన్‌లో జరిగే సమావేశానికి నేతలు హాజరుకావాలని కోరారు.

విద్యుత్ షాక్‌తో బర్రె మృతి

మిరుదొడ్డి (అక్బర్‌పేట-భూంపల్లి), నవంబర్ 17 : ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో పాడి బర్రె మృతి చెందిన సంఘటన అక్బర్‌పేట-భూంపల్లి మండలంలోని వీరారెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బట్టికాడి నర్సాగౌడ్ తన వ్యవసాయ పొలం వద్ద శనివారం రాత్రి బర్రెను కట్టేసి ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం పొలం వద్దకు వెళ్లే సరికి ప్రమాదవశాత్తు విద్యు త్ షాక్‌కు గురై బర్రె మృతి చెంది ఉంది. దీంతో రూ.70 వేలు వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.